క్లుప్తంగా...

హోంమంత్రిని కలిసిన నందికంటి శ్రీధర్



అల్వాల్: రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని గురువారం అల్వాల్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేత నందికంటి శ్రీధర్ మర్యాదపూర్వంగా కలిశారు. బీఆర్‌ఎస్‌లో సముచిత స్థానం ఉంటుందని మంత్రి నందికంటి శ్రీధర్‌కు హామీ ఇచ్చారు.

సగర సంఘం కార్యాలయంలో బోరు పనులు ప్రారంభం



శ్రామికనగర్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మౌలాలి: డివిజన్ శ్రామికనగర్‌లోని సగర సంఘం కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సొంత నిధులతో బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలో అన్ని వర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎర్రంశెట్టి ఆంజనేయులు, గౌరక్క, సత్యం, సాగర్, వెంకటస్వామి, భరత్‌నగర్ అధ్యక్షుడు భాస్కర్, చంద్రకాంత్, సునంద, అన్నమ్మ, స్వామి, సాయిలు, బాలరాజు, కృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం



పంచశీల కాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గురువారం మచ్చబొల్లారం పంచశీల కాలనీలో రూ.కోటి 75 లక్షలతో నిర్మించనున్న సీసీ, బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జితేంద్రనాథ్, అధికారులు డీఈ కార్తీక్, డీజీఎం సాంబయ్య, ఏఈ రవళి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉప్పల్ ఫైర్ స్టేషన్ ప్రారంభం



ఉప్పల్: ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో గతేడాది నిర్మించిన ఫైర్ స్టేషన్‌ను శుక్రవారం ఉదయం రాష్ట్ర హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ, ఫైర్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించనున్నారు. దీంతో పాటు మరో 17 కొత్త ఫైర్ స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

హనుమాన్‌నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో గురువారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పాదయాత్ర చేపట్టారు. స్థానిక సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సామాజిక భవన నిర్మాణానికి రూ.20.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. క్రాంటాక్టర్ నిర్లక్ష్యంతో పనుల్లో ఆలస్యం జరిగిందన్నారు. నూతన క్రాంటాక్టర్‌కు పనులను అప్పగించామని, త్వరగా పనులను ప్రారంభించాలని ఆదేశించారు. కమ్యూనిటీ హాల్‌లో బస్తీదవాఖానాను ఏర్పాటు చేస్తామన్నారు. ఏఈ లింగారావు, వర్క్ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, బాలమణి, కామేశ్వరి, సుజాత, లక్ష్మి, శంకర్, అంజమ్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నాచారం సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

తొమ్మిదేళ్లు.. ఎన్నో మార్పులు..



హెచ్‌బీకాలనీ, చైతన్యనగర్‌లో డబుల్ ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు



చైతన్యనగర్ బాధితులతో మాట్లాడిన బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

- పేదల సొంతింటి కలను సాకారం చేసిన సీఎం కేసీఆర్
- తాగునీటి కష్టాలకు శాశ్వతంగా పరిష్కారం చూపాం
- మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు శ్రీకారం
- హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలి
- బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

కుషాయిగూడ: తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో వచ్చిన మార్పు, ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులను గమనించాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్‌తోనే ఇది సాధ్యమైందని గుర్తించి మరోసారి కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించాలన్నారు. ఉప్పల్ నియోజకవర్గం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ చైతన్యనగర్‌లో గురువారం నిర్వహించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, జొంతు శ్రీదేవి, పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని హంగులతో డబుల్ ఇళ్ల నిర్మాణం చేపట్టి పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇళ్లు వచ్చిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఇళ్లు రాని వారు నిరాశపడొద్దన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని.. అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందజేస్తామన్నారు.

తాగునీటి కష్టాలకు శాశ్వతంగా పరిష్కారం

మహిళలు ఆత్మ గౌరవంతో జీవించాలన్నది కేసీఆర్ ఆశ అన్నారు. ఆడపడుచు బిందె పట్టుకొని బయటకు వస్తే మనకే ఆత్మగౌరవం ఉండదని భావించే గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత తాగునీటి కష్టాలకు శాశ్వతంగా పరిష్కారం చూపారన్నారు. పేదలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించాలన్న సంకల్పంతో రాష్ట్రంలో వెయ్యికిపైగా సోషల్ వెల్ఫేర్ గురుకులాలను ఏర్పాటు చేసి ఒక విద్యార్థిపై రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల తరహాలో నగరం నలుమూలల రూ.1200 కోట్లతో ఎల్‌బీనగర్, సనత్‌నగర్, గచ్చిబౌలి, అల్వాల్ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. విమర్శించే ముందు ప్రతిపక్షాలు ఒక్కసారి గుండె మీద చెయ్యి వేసుకోవాలన్నారు. రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌ను ఆశీర్వదించాలన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాల ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కొత్త రామారావు, గొల్లూరి అంజయ్య, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, పావనిరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పోలీసు పహారాలో చైతన్యనగర్..

డబుల్ ఇళ్ల నిర్మాణం చేపట్టిన హెచ్‌బీకాలనీ, చైతన్యనగర్‌ను గురువారం తెల్లవారుజాము నుంచే పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టే సమయంలో అక్కడ గుడిసెలు వేసుకొని జీవించే 40 వడ్డెర కులాల కుటుంబాలకు డబుల్ ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి ఖాళీ చేయించినట్లు బాధితులు తెలిపారు. దీంతో నిరాశ చెందిన వారంతా బుధవారం రాత్రి డబుల్ ఇళ్ల ఎదుట ఆందోళనకు దిగారు. రంగంలోకి దిగిన కుషాయిగూడ పోలీసులు గురువారం ఉదయం కొంతమందిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

బాధితులకు భరోసా ఇచ్చిన బీఎల్‌ఆర్..

సమావేశం అనంతరం బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చైతన్యనగర్ బాధితులను కలిశారు. జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ఇళ్ల పంపిణీ చేపట్టిందని వారికి చెప్పారు. చైతన్యనగర్ సమస్యను ప్రత్యేక సమస్యగా పరిగణించి అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

- అల్వాల్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- హాజరైన మంత్రి మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి, పక్కన మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: ప్రజా సంక్షేమం బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అల్వాల్ ఈ సేవ సెంటర్ నుంచి ఇందిరాగాంధీ చౌరస్తా వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓల్డ్ అల్వాల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమం అందుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పేద, బడుగు వర్గాల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ప్రతి నెలా పింఛన్ అందజేస్తున్నారని తెలిపారు. పేదవర్గాలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందజేస్తున్నారన్నారు. తాగునీరు, నిరంతరం విద్యుత్ సరఫరా అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మర్రి రాజశేఖర్ పార్టీ నాయకుడిగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబితా కిషోర్, మేకల సునీతా రాముయాదవ్, మీనా ఉపేందర్‌రెడ్డి, మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, ఆకుల నర్సింగరావు, బద్దం పరుశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, అనిల్ కిషోర్, చిందల శ్రీనివాస్‌రెడ్డి, ఖలీల్, జ్యోతి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



సభకు హాజరైన జనం

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుస్తోంది

నందికంటి శ్రీధర్



మాట్లాడుతున్న నందికంటి శ్రీధర్

అల్వాల్: పార్టీ చేసిన నిర్ణయాలను పార్టీ నాయకులు పాటించకపోవడం దురదృష్టకరమని, అందుకే కాంగ్రెస్ పార్టీని వీడాల్సి వచ్చిందని నందికంటి శ్రీధర్ అన్నారు. గురువారం అల్వాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పార్టీ ఉన్నతికి పనిచేశానన్నారు. కుటుంబానికి ఒక్కరికి పోటీ చేసే అవకాశం కల్పిస్తామని ఉదయపూర్‌లో డిక్లరేషన్ చేసిన పార్టీ, నిర్ణయానికి తిలోదకాలు ఇచ్చి కొత్తగా పార్టీలో చేరే వారికి రెండు టికెట్లు కేటాయించడం తనను బాధకు గురిచేసిందన్నారు. పార్టీలో నిజాయితీగా పనిచేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీంతో కన్నతల్లిగా భావించిన కాంగ్రెస్ పార్టీని వీడాల్సి వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానన్నారు. మైనంపల్లి ఓటమికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతను క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తాం

బోనగిరి సురేష్ యాదవ్



మాట్లాడుతున్న బోనగిరి సురేష్ యాదవ్

గౌతంనగర్: కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తామని కాంగ్రెస్ పార్టీ నేత బోనగిరి సురేష్ యాదవ్ అన్నారు. గురువారం మల్కాజిగిరిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొందరు కాంగ్రెస్ పార్టీ వీడి బయటకు వెళ్లిపోయారని అన్నారు. తాము కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తామని, పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామని సురేష్ యాదవ్ స్పష్టం చేశారు. సోనియమ్మ, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. అందుకోసం పార్టీ శ్రేణులు పార్టీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. కానీ స్వార్థం కోసం పార్టీని వీడొద్దన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, విజయమ్మ, ఆంజనేయులు, మోహన్‌బాబు, అంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాను లేకున్నా.. ఆరుగురి జీవితాల్లో వెలుగు

- బ్రెయిన్ డెడ్‌తో వ్యక్తి మృతి
- ఆరుగురికి అవయవ దానం



నాగేష్ (ఫైల్)

బోడుప్పల్: బ్రెయిన్ డెడ్‌తో ఓ వ్యక్తి మృతి చెందగా, తాను మరణించి మరో ఆరుగురికి అవయదానం చేసిన ఘటన బోడుప్పల్‌లో చోటు చేసుకుంది. వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జనగాం జిల్లా కడవెండి గ్రామానికి చెందిన పెద్ది నాగేష్(46) సునీత భార్యాభర్తలు. వీరికి సింధూ, కావ్య ఇద్దరు కుమార్తెలున్నారు. 15 సంవత్సరాల క్రితం బతుకుతెరువు కోసం బోడుప్పల్‌కు వచ్చి ఎస్‌ఐఎస్ కాలనీలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని నెలల క్రితం నాగేష్‌కు గుండె నొప్పి వచ్చింది. వైద్యులు స్టంట్ వేశారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో బీపీ ఎక్కువ కావడంతో స్పృహతప్పి కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న శ్రీకర్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు బ్రెయిన్‌డెడ్ అయినట్లు తెలిపారు. 48 గంటల తర్వాత నాగేష్ మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు అతడి అవయవాలు మరికొందరికి ఉపయోగపడాలనే లక్ష్యంతో ఆరుగురికి అవయవ దానం చేశారు. తాను చనిపోయినా ఆరుగురి జీవితాల్లో వెలుగు నింపండాన్ని స్థానిక కాలనీ వాసులు మెచ్చుకున్నారు. కుటుంబానికి పెద్దదిక్కయిన తండ్రిని కోల్పోవడంతో కుమార్తెలు కన్నీరుమున్నీరయ్యారు. వారిని చూసి స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను 17వ డివిజన్ కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి పరామర్శించారు.

ఉద్యమకారులను విస్మరిస్తే ఓటమి తప్పదు

బీఆర్‌ఎస్ మహిళా నాయకులు

రామంతాపూర్: ఉద్యమకారులను విస్మరిస్తే రాబోయే ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీకి ఓటమి తప్పదని బీఆర్‌ఎస్ మహిళా నాయకులు సంధ్యారాణి, కుర్న లక్ష్మి, మంజులగౌడ్, జానకి పేర్కొన్నారు. రామంతాపూర్ గంగమ్మగుడి వద్ద ఏర్పాటు చేసిన మహిళా కార్యకర్తల సమావేశంలో గురువారం వారు మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్ర సాధనకు కృషి చేసిన వారికి పార్టీలో ప్రాధాన్యం కల్పించడం లేదని వారు ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన డివిజన్ సమావేశంలో తమను కించపరిచేలా కొందరు నాయకులు వ్యవహరించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. పార్టీలో తమకే న్యాయం జరగకపోతే.. మహిళా కార్యకర్తలకు ఏమి జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఉద్యమ మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని, లేనిపక్షంలో తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామని వారు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం



అల్వాల్‌లో సమావేశమైన కాంగ్రెస్ శ్రేణులు

అల్వాల్: కాంగ్రెస్ పార్టీలో ఉంటూ గెలుపునకు కృషి చేస్తామని అల్వాల్ సర్కిల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. అల్వాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం దురదృష్టకరం అన్నారు. ఆయన పార్టీని వీడినా పార్టీకి నష్టం కలగకుండా తాము కాపాడుకుంటామన్నారు. కొందరు నాయకులు వెళ్లారే తప్ప పార్టీ పటిష్ఠంగా ఉందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు అశోర్‌రెడ్డి, చంద్రశేఖర్, కృష్ణగౌడ్, సంతోష్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, వీనస్‌మేరి, పవన్, శివకుమార్ ఉన్నారు.

ఉప్పల్ ఏక్ మినార్ మజీద్‌లో లక్ష్మారెడ్డి ప్రార్థనలు



ఉప్పల్ ఏక్ మినార్ మజీద్‌లో బండారి లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న మత పెద్దలు

ఉప్పల్: మిలాద్– ఉన్ నబీ ఉత్సవాలను పురస్కరించుకుని ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గురువారం ఉప్పల్ ఏక్ మినార్ మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మజీద్ పెద్దలు లక్ష్మారెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ముస్లింలకు ఏ సమస్య వచ్చినా తాను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఆకుల మహేందర్, బాలకృష్ణ, ఖాజా మోహినుద్దీన్, మజీద్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో దుస్తుల పంపిణీ



రామంతాపూర్: స్థానిక డాన్‌బాస్కో అనాథ ఆశ్రమంలో గురువారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన ఆశ్రమంలో ఉన్న పిల్లల పరిస్థితిని నిర్వాహకులకు అడిగి తెలుసుకున్నారు.

ప్రజల సంక్షేమం కోసమే ఆరు గ్యారంటీలు



రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గం ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు స్థానిక వెంకటరెడ్డినగర్‌లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు తౌఫిక్, యూత్ కాంగ్రెస్ నేతలు శ్రవణ్‌రెడ్డి, అరుణ్, ఉపేందర్‌రెడ్డి, విజయ్, యాదయ్య పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి బస్తీ దవాఖానా

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని రాజేంద్రనగర్‌లో నిర్మిస్తున్న బస్తీ దవాఖానా పనులను గురువారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న ఎంతో మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఈ బస్తీ దవాఖానా ఉపయోగపడుతుందని, త్వరలోనే అందుబాటులోకి తెస్తామని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఏఈ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, వెంకట్రావ్, రుద్రాల నరసింహ, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ స్కూల్ స్టోర్‌రూంలో చోరీ

ఉప్పల్: ఉప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలలో స్టోర్ రూమ్ తాళం పగులగొట్టి అందులో ఉన్న బఫర్ బండల్స్(పాత క్వశ్చన్ పేపర్లు)ను దొంగిలించుకుని వెళ్లిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గతేడాది, ఈ ఏడాది ప్రశ్న పత్రాలను స్టోర్‌రూంలో పెట్టి తాళం వేశామని, బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు స్టోర్‌రూంను తెరిచి మూడు బఫర్ బండల్స్‌ను ఎత్తుకెళ్లిపోయారని, ఈ సంవత్సరం పేపర్లకు పోలేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు చెప్పారు.

జిల్లా కోర్టులో న్యాయ సలహా కేంద్రం



కుషాయిగూడ: కుషాయిగూడలోని జిల్లా కోర్టులో న్యాయ అధికార సంస్థ మల్కాజిగిరి ఆధ్వర్యంలో గురువారం న్యాయ సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా వెంకటరమణ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్‌గా వై.హరీష్, టి.శ్రీనివాస్‌ను నియమించినట్లు జిల్లా జడ్జి ఎంఆర్ మధుసూదన్‌రావు తెలిపారు. ఆర్థిక స్థోమత లేని వారి కోసం ఏర్పాటు చేసిన న్యాయ సలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బీజేపీ అవకాశం ఇస్తే మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తా

బీజేపీ సీనియర్ నేత ఆదం విజయ్‌కుమార్



గౌతంనగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి అసెంబ్లీ స్థానానికి పార్టీ అవకాశం ఇస్తే పోటీ చేసి గెలుస్తానని బీజేపీ సీనియర్ నేత ఆదం విజయ్‌కుమార్ అన్నారు. గురువారం గౌతంనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే బీజేపీ తరఫున పోటీలో ఉంటానని, ఎంతోకాలంగా మల్కాజిగిరి ప్రజలతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. తండ్రి రైల్వేలో ఉన్నప్పుడు తమకు మల్కాజిగిరి ప్రాంతంలో అత్యధిక శాతం రైల్వే ఉద్యోగుల కుటుంబాలతో పరిచయం ఉందన్నారు. బీసీ నేతగా అన్ని వర్గాల ప్రజలతోపాటు యువతతో స్నేహం ఉందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు మల్కాజిగిరిలో సంపన్న వర్గాలకు టికెట్ ఇచ్చే అవకాశం ఉందని, బీసీ నాయకుడైన తనకు అధిష్టానం టికెట్ కేటాయిస్తే గెలుస్తానని అన్నారు.

కృష్ణవేణి స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

రామంతాపూర్: కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఇటీవల టీచర్ యూకేజీ విద్యార్థి హేమంత్‌ను కొట్టడంతో మృతి చెందిన విషయం చాలా బాధాకరం, దారుణమని రాష్ట్ర బాలల హక్కుల సంఘం అధ్యక్షురాలు అనురాధ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జాతీయ బాలల పరిరక్షణ హక్కుల కమిషన్ స్కూల్ గుర్తింపును రద్దు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరిపించి ఆ విద్యార్థి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. స్కూల్ గుర్తింపు రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే న్యాయ పోరాటం చేస్తామని ఆమె పేర్కొన్నారు.

పేదలకు డబుల్ ఇళ్లు ఇవ్వకుంటే.. బీఆర్‌ఎస్‌ను ఓడిస్తాం..



మాట్లాడుతున్న ఎన్.బాలమల్లేష్

అల్వాల్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్స్, గృహలక్ష్మి ఇవ్వకుంటే బీఆర్‌ఎస్‌ను ఓడిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ అన్నారు. అల్వాల్ ఈ సేవ కేంద్రం వద్ద సీపీఐ అల్వాల్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిరాహార దీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్.బాలమల్లేష్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందని విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర నాయకులు సురేందర్‌రెడ్డి, సీపీఐ నాయకులు కే.సహదేవ్, రొయ్యల కృష్ణమూర్తి, సల్మాన్‌బేగ్, చంద్రయ్య, జంగయ్య, నరేందర్‌చారి, అజీజ్, కరీం, సుశీల, నర్సింహ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.